4వ పాఠం జూలై 18-24

# ప్రార్థనా శక్తి-ఇతరుల కొరకు విజ్ఞాపన చేయుట

## సబ్బాతు మధ్యాహ్నము జూలై 18

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ప్రకటన 12:7-9; ఎఫెసి 6:12; హెబ్రి 7:25; ఎఫెసి 1:15-21; దాని 10:10-14; 1 యోహాను 5:14-16.**

**కంఠతవచనం : "మీ పాపములను ఒకనితో ఒకడు ఒప్పుకొనుడి. మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనః పూర్వకమైనదై బహు బలముగలదై యుండును" (యాకోబు 5:16).**

నూతన నిబంధన క్రైస్తవ సంఘ సభ్యులు వారికి ప్రార్థన అవసరము ఉన్నదని భావించారు. "వారు ప్రార్థన చేయగానే వారు కూడియున్నచోటు కంపించెను. అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి" (అపొ॥కార్య 4:31). శిష్యులు ప్రార్థించుట గమనించండి. వారు పరిశుద్ధాత్మతో నింపబడియున్నారు. వారు ధైర్యముగా లేక ఎంతో విశ్వాసముతో దేవుని వాక్యమును బోధించిరి.

వారు చేసిన ప్రార్థనలకు, పరిశుద్ధాత్మతో వారు నింపబడుటకు మరియు చాలా శక్తివంతముగా దేవుని వాక్యమును బోధించుటకు మధ్య ఏదో ఒక ప్రత్యక్ష సంబంధమున్నది. "శిష్యులు కేవలం వారికి దీవెనలు కావాలని మాత్రమే వారు ప్రార్థించలేదు. వారి ఆత్మలను రక్షించాలనే భారముతో ఉన్నారు. ఈ లోకమునకు సువార్త ప్రకటింపబడాలని వారు గుర్తించారు. మరియు క్రీస్తు వారికి వాగ్దానము చేసిన శక్తిని పొందగలిగారు" -ఎలెన్ జి వైట్. అపొ॥కార్య పుట 37.

మనము దేవునిని వెదకి, ఇతరుల తరపున మధ్య వర్తిత్వ విజ్ఞాపన ప్రార్థన చేసినపుడు మనము ఆయన చెంతకు సమీపముగా చేరుటకు దేవుడు మన సొంత హృదయాలలో పనిచేయును. మరియు ఆయన రాజ్యము కొరకు మనము సిద్ధపడునట్లు మనకు దైవ సంబంధమైన జ్ఞానమును ఆయన అనుగ్రహించును (యాకోబు 1:5). మనము చూడలేని రీతులలో ఆయన వారిని అర్ధము చేసుకొని ఎంతోశక్తివంతముగ వారితో పనిచేయనైయున్నాడు (1యోహాను 5:14-17). జూలై 25 సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు సిద్ధపడుడి.

## ఆదివారం జూలై 19

### ఒక విశ్వ పోరాటము

**ప్రకటన 12:7-9; ఎఫెసి 6:12; 2కొరింథి 10:4 పోల్చిచూడుడి. మధ్యవర్తిత్వ ప్రార్థన విషయమైన అవగాహనమును ఈ వాక్యాలు ఏవిధంగా ప్రభావితము చేస్తాయి?**

-----------------------------------------------

చూడగలిగిన మరియు చూడలేని ప్రపంచమునకు మధ్యన ఉన్న తెరను బైబిలు పెరికివేసినది. మంచికి మరియు చెడుకు మధ్యన నీతిశక్తులు మరియు అంధకార శక్తుల మధ్యన క్రీస్తు మరియు సాతాను మధ్యన ఒక పోరాటము కొనసాగుచున్నది. ఈ విశ్వ పోరాటములో మానవ జాతికి ఉన్న స్వేచ్ఛను దేవుడు గౌరవిస్తున్నాడు. మానవుని చిత్తమును ఆయనకు అనుకూలముగా మార్చుకొనడము గాని లేక మానవునికున్న మనస్సాక్షిని బలవంతము పెట్టుట గాని దేవుడు ఎన్నడూ చేయడు. దైవ సంబంధమైన సత్యము విషయములో స్త్రీ పురుషులను ఒప్పించుటకు ఆయన తన పరిశుద్ధాత్మను పంపిస్తాడు. (యోహాను 16:7, 8) శాశ్వత లోకము కొరకు ప్రజలను ప్రభావితము చేయుటకు పరలోకపు దూతలు ఆ రణరంగములోనికి ప్రవేశిస్తారు (హెబ్రి 1:14). ఆయన యొద్దకు ప్రజలు నడిపింపబడులాగున దైవానుకూలమైన సంఘటనలను దేవుడే సిద్ధపరుస్తాడు.

మానవునికున్న మనస్సాక్షిని దేవుడు బలవంతము చేయడు. బల ప్రయోగము జరుపుట దేవుని రాజ్యమునకు విరుద్ధమైనది. దేవుని రాజ్యమునకు పునాదియైన ప్రేమ ఎవరిని బలవంతము చేయదు. బలవంతము పెట్టుట దేవుని రాజ్యమునకు విరోధమైనది. ఇక్కడ ప్రార్థన యొక్క ప్రాధాన్యత కనిపిస్తున్నది. మనము ప్రార్థించకముందే దేవుడు జనులను చేరుటకు ఆయన చేయగలిగినదంతయు చేయుచున్నను మన ప్రార్థనలు దేవుని యొక్క మహా శక్తిని విడుదల చేస్తాయి. ఇతరుల కొరకు మనము ప్రార్థించాలనే కోరికతో మనకున్న స్వేచ్ఛను మనము ఉపయోగించుకున్నప్పుడు ఆయన దానిని గౌరవిస్తాడు. మరియు మంచిచెడులకు మధ్య జరుగుచున్న ఈ పోరాటము సందర్భముగా మనము ప్రార్థించినపుడు కన్నా ఇతరులకు సహాయము కొరకు మనము ప్రార్థించినపుడు దేవుడు మరింత ఎక్కువగా మన పక్షమున స్పందిస్తాడు.

“ఈ వాక్యమును ఒకసారి పరిశీలించండి. మనము దేవునిని అడుగకముందు ఇవ్వని దీవెనలను మనము విశ్వాసముతో చేసిన విన్నపములకు లేక ప్రార్థనలకు జవాబుగా ఆయన అధికముగా దీవెనలివ్వడమనునది దేవుని యొక్క ప్రణాళికలో ఒక భాగమైయున్నది” -ఎలెన్ జి వైట్, మహా గొప్ప సంఘర్షణ, పుట 525. మంచి చెడుల మధ్య జరుగుచున్న ఈ గొప్ప సంఘర్షణలో ప్రార్థన ఒక మార్పును తీసుకొని వస్తుంది. క్రీస్తును ఎరుగని ఎవరో ఒకరికొరకు మనము ప్రార్థించినప్పుడు వారి జీవితముల లోనికి దైవ సంబంధమైన దీవెనలు ప్రవహించునట్లు అది ప్రవాహ మార్గములను తెరచును. వారి కొరకు ప్రార్థించాలని మనము తీసుకొనిన స్వేచ్ఛ నిర్ణయాన్ని దేవుడు గౌరవిస్తాడు మరియు వారి పక్షమున ఆయన మరింత శక్తి వంతముగా పనిచేయును.

మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనా విషయమును గూర్చి ఆలోచన చేసినపుడు దేవుడు ఏ రీతిలో పనిచేస్తాడో తెలియని స్థితిలో మనమున్నామని ముందుగా ఎంతో వినయముతో అంగీకరించవలసియున్నాము. అయితే అంతమాత్రాన మనకు మరియు ఇతరులకు దీవెనలు కావాలని నిరంతరము ప్రార్థన చేయకూడదని అది మనకు చెప్పుటలేదు.

**మనము ప్రార్థించుట మానివేసినపుడు కన్నా, మనము ప్రార్థించినపుడు దేవుడు**

**మరింత ఎక్కువ శక్తివంతముగా పనిచేస్తాడని నీవెందుకు ఆలోచిస్తున్నావు? దేవుని కార్యములు ఏవిధంగా నెరవేరునో మనకు పూర్తి అవగాహన లేకపోయినప్పటికి, ఇతరుల కొరకు ప్రార్థించమని బైబిలు మనలను ఎందుకు హెచ్చరించుచున్నది?**

**సోమవారం** **జూలై 20**

## యేసు - మధ్యవర్తిత్వ ప్రార్థన యోధుడు

**లూకా 3:21, 5:16; లూకా 9:18 చదువుడి. యేసు యొక్క ప్రార్థన జీవితమునకును మరియు ఫలప్రదమైన ఆయన సువార్త పరిచర్యకును మధ్యనున్న సంబంధమును గూర్చి ఈ వాక్యములు ఏమి చెప్పుచున్నవి?**

---------------------------------------------

---------------------------------------------

యేసు తన తండ్రితో నిరంతరము జరిపిన దైవ సంబంధమైన సంప్రదింపులతో ఆయన జీవితము గడిచినది. ఆయన బాప్తిస్మము పొందిన సమయములో మెస్సీయాగా తన పరిచర్యను ప్రారంభించినప్పుడు ఆయన ద్వారా పరలోకపు లక్ష్యము నెరవేరుటకు అవసరమైన దైవ శక్తి కొరకు ఆయన ప్రార్థించాడు. ఆయన ముందుంచబడిన కార్యమును పూర్తి చేయుటకు మరియు తన తండ్రి యొక్క చిత్తమును నెరవేర్చుటకు పరిశుద్ధాత్మ ఆయనను శక్తిమంతునిగా చేసెను. 5 వేల మందికి ఆహారమును పంచి పెట్టినప్పుడు గాని, కుష్టు వ్యాధిగ్రస్తుని స్వస్థపర్చినపుడు గాని లేక దయ్యముల బారి నుండి ఒక యౌవనస్తుని విడుదల చేసినపుడు గాని మంచి చెడుల మధ్య జరుగుచున్న ఈ పోరాటములో అంధకార శక్తులను ఓడించుటకు ప్రార్థనే ఒక బలమైన ఆయుధముగా పనిచేయునని యేసు గుర్తించెను. మన బలహీనతలకు నిస్సహాయ స్థితిని సర్వశక్తిమంతుడైన దేవుని శక్తితో జత చేసినప్పుడు ప్రార్థన పరలోకము నియమించిన మార్గమవుతుంది. మనలను మనము దేవుని మద్దతు కొరకు ఆశ్రయించుటకు ప్రార్థన ఒక సాధనముగా సహాయపడుతుంది. అప్పుడు మనము ఎవరి కొరకు ప్రార్థిస్తున్నామో వారి యొక్క హృదయములను దేవుడు తట్టి ఆశీర్వదిస్తాడు.

**లూకా 22:31-34 మరియు హెబ్రీ 7:25 చదువుడి. సమీప భవిష్యత్తులో పేతురు ఎదుర్కొననైయున్న శోధనల విషయమై ముందుగానే అతడు సిద్ధపడునట్లు యేసు ఇచ్చిన ధీమా ఏమిటి? మనము కూడా శోధనలను ఎదుర్కొను చుండగా ప్రతి వారికి ఆయన ఇచ్చే హామీ ఏమిటి?**

---------------------------------------------

---------------------------------------------

ప్రార్థనాపరులైన స్త్రీ పురుషులు ఆత్మలను రక్షించే పనిలో కార్యసాధకులవుతారు. పేరు పెట్టి పేతురు కొరకు యేసు ప్రార్థించెను. పేతురు గొప్ప శోధనను ఎదుర్కొనవలసిన సమయములో యేసు అతనికి హామీ ఇచ్చాడు. దేవుని రాజ్యమును విస్తరించుటలో పేతురు కున్నటువంటి శక్తి సామర్థ్యాలను గూర్చి సాతాను చాలా బాగుగా అర్థము చేసుకున్నాడు. క్రైస్తవ సంఘములో ఒక నిశ్చయాత్మక ప్రభావమును చూపగలిగే పేతురును సాధ్యమైనంత వరకు నాశనము చేయుటకు సాతానుడు చేయగలిగిన ప్రయత్నాలన్ని చేయసాగాడు. అయితే

పేతురు ఎదుర్కొనిన అన్ని శోధనల సమయములో యేసు అతని కొరకు ప్రార్థిస్తూనే ఉన్నారు. మరియు ప్రభువు యొక్క ప్రార్థనలకు జవాబు కూడా దొరికినది. మన కొరకు కూడా మన రక్షకుడు ప్రార్థిస్తున్నాడనే సత్యమును గుర్తించగలిగినప్పుడు గొప్ప అనుభూతిని పొందుదుము. ఆయనతో కలిసి, ఆయన సింహాసనము యెదుట మనము కూడా మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనలో పాల్గొనాలని ఆయన మనలను ఆహ్వానించుచున్నాడు. మనమెవరి కొరకైతే విడువక ప్రార్థిస్తున్నామో వారిని దేవుడు దీవించునని గుర్తించి ఆయన మీద ఆధారపడాలి.

**ఇపుడు మనమెవరి కొరకు ప్రార్థిస్తున్నాము? పరిస్థితులు ఎంత కఠినముగా కనిపించినా ఎందువలన మనము ప్రార్థించుట మానరాదు?**

మంగళవారం **జూలై 21**

## పౌలు యొక్క మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనలు

మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థన బైబిలునకు సంబంధించినదే. పౌలు తన సువార్త పరిచర్యయంతటిలో సువార్త పరిచర్య సభల ద్వారా స్థాపించబడిన క్రైస్తవ సంఘాలలో నూతనముగా మారుమనస్సు పొందిన విశ్వాసులకొరకు ఆయన ప్రార్థించేవాడు. ఆయన ప్రార్థించకపోతే జరగని విషయాలు, ఆయన ప్రార్థించినప్పుడు అవి జరిగినట్లు పౌలు నమ్మియున్నాడు. ఆయన ప్రేమించిన వారి నుండి ఆయనను దూరపర్చినను ఒకరికొరకు ఒకరు ప్రార్థించుకొనుట ద్వారా వారందరు హృదయములో ఐక్యపర్చబడియున్నారనే విషయాన్ని ఆయన గుర్తించాడు.

**ఎఫెసి 1:15-21 చదువుడి. ఎఫెసీయుల కొరకు దేవునికి పౌలు చేసిన వివిధ విన్నపములను ఈ క్రింది గీతలపై వ్రాయుడి. వారికి ఇవ్వలసినదిగా ఏ ప్రత్యేకమైన విషయాన్ని ఆయన దేవుడిని అడిగాడు?**

----------------------------------------------

----------------------------------------------

ఎఫెసీలోని విశ్వాసుల కొరకు పౌలు చేసిన ప్రార్థన చాలా అసాధారణమైనది. ఆత్మీయ విషయాలను వివేకముతో పరిశీలించుటకును మరియు వాటి భావమును తెలుసుకొనుటకు జ్ఞానమును వారికి అనుగ్రహించమని అతడు దేవునికి ప్రార్థించాడు. వారి యెడల దేవుడు పౌలు అడిగిన విషయాలను నెరవేర్చినప్పుడు వారి మనస్సులు దైవ సంబంధమైన సత్యములు వారికి విశదపర్చబడుట వలన నిత్యజీవమునకు సంబంధించిన నిరీక్షణ వారిలో కలుగును. వారి జీవితాలలో దేవుని యొక్క శక్తి ద్వారా నెరవేరుతున్న ఘనమైన కార్యములను గూర్చిన అనుభవము వారు పొందునట్లు కూడా ఆయన ప్రార్థించాడు. ఈ దేవుడు శక్తిమంతుడైన వాడు కావున మృతులలో నుండి యేసును లేపెను. మరియు యేసు యొక్క పునరుత్థానము వలన ఆయనలో నిత్యజీవముందనే నిరీక్షణకు పునాది వేయబడెను. వారికి క్రీస్తు యొక్క మహిమైశ్వర్యమును మరియు ఆయన స్వాస్థ్యమును గూర్చి జ్ఞాపకము చేసి తన ప్రార్థనను ముగించాడు. పౌలు వారి కొరకు ప్రార్థించుచున్నాడనియు, ఆయన ఏమి ప్రార్థిస్తున్నాడో వారు గ్రహించుట ద్వారా ఎఫెసులోని క్రైస్తవులు మంచి ప్రోత్సాహముతో నింపబడియుండవచ్చును.

**ఫిలిప్పి 1:3-11 చదువుడి. పౌలు ప్రార్థించిన విధానమునుగ్రహించండి. నీవు గనుక**

**ఫిలిప్పీలోని క్రైస్తవ సంఘ సభ్యుడవై యుండి పౌలు నుండి ఇట్టి ఉత్తరమును నీవు స్వీకరించిన యెడల ఆ ప్రార్థనలో ఇమిడియున్న భావమును బట్టి నీ భావాలు ఏ విధముగా ఉండును? ఎందువలన? దాని మాటలలో కనుగొనబడిన వాగ్దానాలు ఏమిటి? అదే సమయములో అందులో హెచ్చరికలేమిటి?**

---------------------------------------------

---------------------------------------------

బైబిలులో ప్రోత్సాహమునిచ్చే ఉన్నత స్థితికి తీసుకొని వెళ్ళే మాటలలో ఇందులో కొన్ని కనిపిస్తున్నాయి. అంతమాత్రమే కాకుండా మనమందరము యేసులో ఏమైయుండాలని దేవుని ఉద్దేశమైయున్నదో దానికి సంబంధించిన అనేక వాగ్దానములు మరియు వివేకమును జ్ఞానమును అనుగ్రహింపబడెను.

బుధవారం **జూలై 22**

## కనిపించని శక్తులు పనిచేయుచున్నవి

"మహాగొప్ప పోరాటము" అని మనము పిలుచుచున్న మంచి చెడుల మధ్య జరుగుచున్న ఈ యుద్ధములో మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థన ఒక బలమైన ఆయుధముగా ఉన్నది. ఈ పోరాటమును గూర్చి స్పష్టముగా బయలుపర్చే కొన్ని ఆధారములలో ఒకటి దానియేలు 10లో ఉన్నది.

యూదులు బబులోను దేశములో బానిసలుగా 70 సం॥ జీవించవలసి యుంటుందని యిర్మియా ప్రవక్త ముందుగానే ప్రవచించుట చూస్తున్నాము. యూదులు బంధీలుగా జీవించవలసిన ఈ ప్రవచన కాలము దానియేలు జీవితము యొక్క అంతిమ దశలో ముగియనైయున్నది. దానియేలు ఆ విషయములో ఆందోళన చెందుచున్నాడు. యిర్మియా పలికిన మాటల యొక్క నెరవేర్పునకు సంబంధించిన నిదర్శనమేమీ అతనికి కనిపించుట లేదు. తన ప్రజలు ఇంకా బానిసత్వములోనే నలిగిపోతూ ఉన్నారు.

బబులోను సామ్రాజ్యమును ఓడించి మాదీయులు మరియు పారశీకులు వారి రాజ్యమును నెలకొల్పారు. అయితే యూదులు మాత్రము అప్పటికి బానిసలుగానే అక్కడున్నారు. దానియేలు మూడు వారములు ఉపవాసముండి ప్రార్థించాడు. తన ప్రజల పక్షమున అతడు ఎంతో పట్టుదలతో మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థన చేసాడు. మూడవ వారము చివరలో అతనికి మహిమతో కూడిన ఒక దూత ప్రత్యక్షమయ్యెను.

**దానియేలు 10:10-14 చదువుడి. ఎప్పుడు దానియేలు యొక్క ప్రార్థనలు వినబడినవి? తాత్కాలికముగా వాటిని ఆటంకపరచినవి ఏమిటి?**

---------------------------------------------

---------------------------------------------

ఇది ఒక ఆసక్తిని కలిగించే వాక్య భాగము. దానిని పూర్తిగా అర్థము చేసుకొనుటకు ముందుగా కొంతమందిని గుర్తించవలసియున్నాము. పారసీక రాజ్యము యొక్క రాజు ఎవరు? నిజముగా కోరెషు మాత్రము కాదు. అతడు పారశీక సామ్రాజ్యముకు రాజై యున్నాడు. కాబట్టి ఇక్కడ చెప్పబడిన మాట తీరును బట్టి చూచినయెడల "పారసీకుల రాజ్యాధిపతి"

అనగా సాతానును సూచించుచున్నది. అతడిని యేసు “ఈ లోకాధికారి” అని పిలుచుచున్నాడు. (యోహాను 12:31; 14:30) పౌలు అతనిని వాయు మండల సంబంధమైన అధిపతి అని పిలిచెను. (ఎఫెసి 2:2) “పారసీకుల రాజ్యాధిపతి”గా సాతానుడు ప్రాతినిధ్యము వహించుచున్న యెడల అప్పుడు “మిఖాయేలు” అనగా ఎవరై యుంటారు? “మిఖాయేలు” అనే పదము బైబిలులో ఐదు సార్లు వాడబడెను. (ప్రకటన 12:7; యూదా 9; దాని 10:13, 21; 12:1) ఈ పై వాక్యాలను జాగ్రత్తగా అధ్యయనము చేసిన యెడల అవి బయలుపర్చే విషయమేమిటంటే “మిఖాయేలు” అనగా దేవుని వంటివాడనియు, అంటే సాతానుతో యుద్ధము చేసే దేవదూతల సమూహమునకు సేనాధిపతియైన యేసుకు మరొక పేరుగా వివరించబడినది. క్రీస్తు శాశ్వతమైనవాడు. ఏదియు ఉనికిలోనికి రాకపూర్వమే ఉనికిలో ఉన్నవాడు. దైవ సంబంధమైన సర్వశక్తిమంతుడైన దేవుని కుమారుడైయున్న దేవదూతల సమూహమునకు ఆయన సర్వ సేనాధిపతిగా నిర్వహించవలసిన ఆయన బాధ్యతలలో ఒకటి ఏమిటంటే సాతానును ఓడించి మరియు చివరికి అతనిని నాశనము లేక అంతము చేయవలసియున్నది.

దానియేలు 10వ అధ్యాయము తెరను ప్రక్కకు తొలగించి మంచి చెడుల మధ్యన జరగవలసిన పోరాటమును బయలుపర్చుచున్నది. దానియేలు ప్రార్థించినట్లు మిఖాయేలు సర్వశక్తిమంతుడైన యేసు పరలోకము నుండి దిగివచ్చినట్లు నరకమునకు చెందిన అంధకార శక్తులను ఓడిస్తాడు. దానిని మనము చూడలేకపోయినను, మనము చేసే మధ్య వర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనలకు జవాబు నిచ్చుటకు యేసు పని గలిగియున్నాడు. ఆయన ఒక శక్తిమంతుడైన రక్షకుడు. మనము చేసే ప్రార్థన కూడా వినబడకుండా లేక దేవుని దృష్టికి వెళ్ళకుండా ఉండదు.

**నీ సొంత జీవితములో మహా గొప్ప పోరాటము చోటు చేసుకున్న వాస్తవమును నీవెట్లు చూస్తున్నావు? నీవు తీసుకునే స్వేచ్ఛా నిర్ణయాలను గూర్చి వాస్తవముగా జరిగే ఈ యుద్ధము ఏమి చెప్పవలసియున్నది?**

## గురువారం — జూలై 23

## ప్రార్థనపై కేంద్రీకరించడం

ప్రార్థనలో కొంత ప్రత్యేకత ఉండాలని బైబిలంతటిలో నొక్కి చెప్పడం జరిగింది. ప్రార్థన అనునది ఏదో సందిగ్దములో ఉన్న ఆత్మ మూలుగు కాదు. అది ప్రత్యేకమైన విజ్ఞప్తులను దేవుని ముందు ఉంచుతుంది. యేసు ప్రత్యేకముగా శిష్యుల కొరకు ప్రార్థించాడు. ఎఫెసి, ఫిలిప్పీ మరియు కొలస్సిలో ఉన్న క్రైస్తవుల కొరకు అపొస్తలుడైన పౌలు ప్రత్యేక ప్రార్థనలు చేసేవాడు. జాన్ మార్కు, తీతు, మరియు తిమోతివంటి యువకులైన సహచరుల కొరకు ఆయన ప్రార్థించేవాడు.

**1సమూయేలు 12:22-24; యోబు 16:21 చదువుడి. ఈ వాక్యాలలో ఉన్న సమానమైన విషయాలేమిటి? అవి మనకు మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనల గూర్చి ఏమి చెప్పుచున్నవి?**

---

---------------------------------------------

సమూయేలు మరియు యోబు ఇరువురూ పట్టుదలతోను, హృదయపూర్వకమైన ప్రత్యేకమైన విజ్ఞాపన ప్రార్థనలను చేయవలసిన అవసరమును గూర్చి నొక్కి వక్కాణించి చెప్పుచున్నారు. సమూయేలు మాటలు చాలా గంభీరముగా ఉన్నవి. "నా మట్టుకు నేను మీ నిమిత్తము ప్రార్థించుట మానుట వలన యెహోవాకు విరోధముగా పాపము చేసినవాడనగుదును. అది నాకు దూరమగునుగాక" (1సమూ 12:23) అని దుఃఖముతో వేడుకొనెను. యోబు మాటలలో సమూయేలు యొక్క ప్రార్థన ప్రతిధ్వనించుచున్నట్లు కొంత వరకు వినగలము. "నరపుత్రుని విషయమై నేను దేవుని తట్టు దృష్టియుంచి కన్నీళ్ళు ప్రవాహముగా విడుచుచున్నాను" (యోబు 16:21) క్రీస్తు ఎరుగని స్త్రీ పురుషులను గూర్చి ప్రార్థన ద్వారా వేడుకొనవలసియున్నాము.

**1యోహాను 5:14-16 చదువుడి. ఇతరుల నిమిత్తము మనము మధ్యవర్తిత్వపు విజ్ఞాపన ప్రార్థన చేసినపుడు ఏమి సంభవిస్తుంది?**

---------------------------------------------

---------------------------------------------

ఇతరుల కొరకు మనము ప్రార్థించినపుడు వారికి దేవుని యొక్క దీవెనలు ప్రవహించుటకు అనుకూలమైన కాలువ వలె మనముంటాము. వారికి మన ద్వారా దేవుడు పరలోకపు సింహాసనము నుండి జీవ జలముల ప్రవాహమును ఆయన కుమ్మరిస్తాడు. చిత్తశుద్ధితో ఇతరుల కొరకు మనము చేసే ప్రార్థనల శబ్దానికి సాతాను దూత గణమంతయు భయముతో వణకుదురు. ఈ ప్రాముఖ్యమైన మాటల ద్వారా ప్రార్థన యొక్క శక్తిని గూర్చి ఎలెన్ జి వైట్ వివరిస్తున్నారు. "అతని బలమైన విరోధి దేవుని యొక్క బలము మరియు మహిమ ముందు ప్రార్థన చేసినప్పుడు సాతానుడు తట్టుకొనలేక భయముతో వణుకును. మనః పూర్వకముగా చేసే ప్రార్థన శబ్దమునకు సాతాను యొక్క దూత గణమంతయు వణుకును" - సంఘములకు సాక్ష్యములు సంపుటి 1, పుట 346. తప్పిపోయిన స్త్రీ పురుషులను సంపాదించాలనే పోరాటములో దైవ శక్తి యొక్క మూలముతో ప్రార్థన మనలను జతకలుపును.

**మత్తయి 18:18,19 చదువుడి. మధ్యవర్తిత్వపు ప్రార్థనకు ఈ వాక్యాలు ఎటువంటి సంబంధాన్ని కలిగియున్నవి? ప్రభువును ఎరుగనట్టి ఇతరుల రక్షణ కొరకు ప్రార్థించవలసియుందని ఈ వాక్యము ఏవిధంగా ప్రోత్సహించుచున్నది.**

**శుక్రవారం** **జూలై 24**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ వ్రాసిన "క్రీస్తు యొద్దకు మెట్లు"లో నుండి "ప్రార్థన యొక్క ఆధిక్యత, పుటలు 93-104; సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 7 నుండి "సంఘ సభ్యుల కొరకు పరిచర్య చేయుట" పుటలు 19-24 చదువుడి.

మనము ఇతరుల కొరకు ప్రార్థించినపుడు ఆయన యెడల మనకున్న నమ్మకమును బట్టి దేవుడు మనలను గౌరవిస్తాడు. మానవ జీవితాలను మార్పు చేయుటకు పరలోకము

యొక్క మూల నిధులనన్నింటిని ఉపయోగించి ఆయన శక్తి మీద మనము ఆధారపడునట్లు సహాయపడును. దేవుని సింహాసనమునకు మన ప్రార్థనలు ఆరోహణమవుతుండగ ఆయన ఆజ్ఞ ప్రకారము దేవదూతల సమూహము వారి పరిచర్య ప్రారంభిస్తారు. సజీవమైన విశ్వాసముతోను, చిత్తశుద్ధితోను చేసే ప్రతి ప్రార్థనకు అంత వరకు వేచియుండే దూతలు యేసు క్రీస్తు యొక్క నడిపింపులో ప్రార్థనలకు జవాబునిచ్చే పరిచర్యలో పాల్గొంటారు." –ఎలెన్ జి వైట్, సెలెక్టెడ్ మెసేజస్ పుస్తకము 2, పుట 377. ఒక్క ప్రార్థన కూడా దేవుని చేత మరువబడదు. ఒక్క ప్రార్థన కూడా ఎన్నడు నిరర్థకము కానేరాదు. ఆ సమయము మరియు స్థలమును బట్టి దేవుని చిత్తము ప్రకారము ప్రతి ప్రార్థనకు జవాబునిచ్చుటకు అవి పరలోకములో భద్రపర్చబడి ఉంటాయి. "విశ్వాసముతో చేసిన ప్రార్థన ఎన్నడు మరువబడదు. కాని ప్రతి ప్రార్థన అడిగిన దాని ప్రకారము మనము ఎదురుచూస్తున్నట్లు జరుగుతుందనుకొనుట కేవలం ఒక అపోహ మాత్రమే" – ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 1, పుట 231. మన భార్యలు భర్తలు, మన కుమారులు, కుమార్తెలు, బంధువులు, స్నేహితులు, మరియు క్రీస్తును ఎరుగనట్టి మన సహోదరులను గూర్చి మనము ప్రార్థించుటకు ఇది ఎట్టి ప్రోత్సాహాన్నిస్తుంది? ఎంతో చిత్తశుద్ధితో చేసే ఏ ఒక్క ప్రార్థన కూడా నిరర్థకము కాదు. ప్రార్థనలకు తక్షణమే జవాబు వెదకకూడదు. అయితే దేవుడు వారి హృదయాలను కదిలించినపుడు దాని ఫలితాలను కేవలము నిత్యరాజ్యములోనే చూడగలము.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ఫిలిప్పీ 1:19; కొలస్సె 4:2,5; 2థెస్సలో 3:1,2 చదువుడి. ఫిలిప్పిలో ఉన్న విశ్వాసులు ప్రార్థించగా, పౌలు బంధింపబడినపుడు అతనికి ఎట్టి ఆదరణ కలిగింది? ఆయన పక్షాన కొలస్సీయులను, థెస్సలోనీయులను ఏమి ప్రార్థించమని వారిని కోరెను? ఆత్మలను రక్షించే విషయములో మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనలకున్న సంబంధమేమిటి?
2. మనము జీవించుచున్న ఈ లోకములో మహా గొప్ప పోరాటము ఎంత వాస్తవమైనదో అనే విషయాన్ని చర్చించండి. ఈ పోరాటమును గూర్చి మీకు కలిగిన అనుభవమును బట్టి ప్రార్థన యొక్క ప్రాముఖ్యత ఏవిధంగా అవసరమైయున్నది? అవును యేసు యుద్ధమును గెలిచాడు. ఆయన పక్షమే చివరిగా విజయము పొందుతుంది. అయితే ఈ మధ్యకాలములో మనము ప్రార్థనలయందు నిలకడగా ఉంటూ ఇతరుల రక్షణ కొరకు మనము విశ్వాసముతో ఎందుకు పనిచేయవలసియున్నాము?
3. ప్రయోజనకరమైన జీవితములో మధ్యవర్తిత్వ విజ్ఞాపన ప్రార్థనకు ఎదురయ్యే ఆటంకాలు ఏమిటి? అవసరమైన వారి కొరకు మనమెక్కువ ప్రార్థన చేయవలసియుండగా అట్లు చేయక ఎట్టి సాకులు చెప్పుటకు వెతుకుతుంటాము?

★★★